వైభవంగా ఘటం ఊరేగింపు



ఘటం ఊరేగింపులో ఎమ్మెల్యే వెంకటేష్

అంబర్‌పేట: అంబర్‌పేట మహంకాళి ఆలయంలో అమ్మవారి ఘటం ఊరేగింపును ఆదివారం రాత్రి నిర్వహించారు. ఘటాన్ని మోర నర్సింగ్‌రావు ముదిరాజ్ ఎత్తుకుని పలు వీధుల్లో ఊరేగించారు. అమ్మవారి ఘటానికి స్థానికులు సాకపోసి స్వాగతం పలికి పూజలు చేశారు. ఈ ప్రారంభ వేడుకలకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, వై.శంకర్‌గౌడ్, గిరిధర్‌గౌడ్, కిషోర్, గడ్డం శ్రీధర్‌గౌడ్, నాయకులు శంభుల శ్రీకాంత్‌గౌడ్, శ్రీరాములు ముదిరాజ్, చుక్క జగన్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వ రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9న నిర్వహించే ఆందోళనను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కన్వీనర్లు టి.సాగర్, జక్కుల వెంకటయ్య, డీజీ నరేంద్రప్రసాద్, ఆర్.వెంకట్‌రాములు, విజయ్ పిలుపునిచ్చారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జాతీయ సార్వత్రిక సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కార్మికులకు ప్రభుత్వం తీవ్ర నష్టం చేసిందన్నారు. రైతాంగానికి రాత పూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.ప్రసాద్, మూడు శోభన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో మరమ్మతులు చేపట్టండి



తిలక్‌నగర్‌లో అధికారులతో కార్పొరేటర్

అంబర్‌పేట: అధ్వానంగా మారిన రోడ్డు సమస్య పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బీ.పద్మావెంకట్‌రెడ్డి సూచించారు. డివిజన్‌లోని బతుకమ్మకుంట – తిలక్‌నగర్ రోడ్డు అధ్వానంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుసుకున్న కార్పొరేటర్ సోమవారం ఆ ప్రాంతంలో పర్యటించారు. రోడ్డ మరమ్మతుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. రోడ్డు మరమ్మతు చేస్తుండగా ట్రాఫిక్ అధికారులు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఇంజినీరింగ్ అధికారులు ప్రశాంతి పాల్గొన్నారు.

గీతన్నలకు రియల్ వ్యాపారులు నష్ట పరిహారం చెల్లించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తాటి చెట్లను తొలగించి ఉపాధి లేకుండా చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు గీతన్నలకు నష్టపరిహారం చెల్లించాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం కొర్రెముల గ్రామం మేడ్చల్–మల్కాజగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం పరిధిలో తాటి చెట్లను తొలగించిన గ్రామాన్ని సందర్శించారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా ఉన్న తాటి చెట్లను తొలగించి గీతన్నల ఉపాధిని దెబ్బ తీయడం సరైంది కాదన్నారు. చెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఎక్సైజ్ అధికారులను డిమాండ్ చేశారు.

బిషప్ కౌన్సిల్ రాజకీయ విభాగం అధ్యక్షుడిగా ఆర్‌పి పాల్

చిక్కడపల్లి: తెలంగాణ బిషప్ కౌన్సిల్ రాజకీయ విభాగం అధ్యక్షుడిగా సేవారత్న రెవరెండ్ డాక్టర్ ఆర్‌పి పాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీబీసీ అధ్యక్షుడు బిషప్ విక్రమ్ డాక్టర్ ఆర్‌పి పాల్ క్రైస్తవులకు చేసిన సేవలను గుర్తించి వారిని టీబీసీలోనికి ఆహ్వానించారు. ఈ మేరకు పాల్‌కు పొలిటికల్ వింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. సోమవారం ఆయనకు టీబీసీ పక్షాన బిషప్ ఫ్రాన్సిస్, బిషప్ ప్రదీప్ నియమాక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెవరెండ్ పాల్ మాట్లాడుతూ... క్రైస్తవులకు మరిన్ని సేవలందించేందుకు కృషి చేస్తానని అన్నారు.

సార్వత్రిక సమ్మెకు ఐద్వా సంపూర్ణ మద్దతు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశవ్యాప్తంగా ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంధుకు ఐద్వా సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, అధ్యక్షురాలు ఆర్.అరుణజ్యోతి, సహాయక కార్యదర్శి కేఎన్ ఆశాలత తెలిపారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, కూలీల విధానాలను తిప్పికొట్టాలని వారు పిలుపునిచ్చారు.

హైకోర్టు ఆదేశాలు బేఖాతరు

- కోర్టు ఆదేశాల మేరకు సాయినగర్‌లో పలు గోదాంలు సీజ్
- మరుసటి రోజే తెరిచి యథావిధిగా వ్యాపారాలు
- పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న సాయినగర్ వాసులు



యథావిధిగా వ్యాపారాలు నిర్వహిస్తున్న స్క్రాప్ గోదాం యజమానులు

ముషీరాబాద్: భోలక్‌పూర్‌లో డివిజన్ సాయినగర్‌లో రోజురోజుకు జనావాసాల మధ్య అక్రమంగా, ప్రమాదకరంగా కొనసాగుతున్న స్క్రాప్ గోదాముల వల్ల కలిగే రకరకాల అనారోగ్య, కాలుష్య సమస్య, పబ్లిక్ న్యూసెన్స్, అగ్నిప్రమాదాల సమస్యలను భరించలేక కాలనీవాసులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ సమస్యలన్నింటినీ పరిగణలోకి తీసుకుని కోర్టు స్క్రాప్ గోదాంలను మూసేయాలని ఆర్డర్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్–15 డీఎంసీ రామాంజులరెడ్డి టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ సిబ్బందితో వచ్చి పోలీసుల బందోబస్తు మధ్య స్క్రాప్ గోదాంలను ఏప్రిల్ 24వ తేదీన సీజ్ చేశారు. ఈ కాలనీవాసులతో సహా ప్రజలందరూ సంతోషించారు.

సంతోషం ఒక్క రోజు ముచ్చటే...

సీజ్ చేసిన సదరు గోదాంలు మరుసటి రోజే తెరుచుకోవడంతో కాలనీవాసుల సంతోషం ఒక్కరోజు ముచ్చటగానే మిగిలిపోయింది. సీల్స్‌ను తొలగించి తాళాలను బద్దలు కొట్టి వ్యాపారాలు యథావిధిగా కొనసాగిస్తున్నారు. ఈ విషయాలను కాలనీవాసులు జీహెచ్‌ఎంసీ అధికారులు, పోలీసు అధికారులకు రాత పూర్వకంగా తెలియజేసిన స్క్రాప్ యజమానులపైన ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

◆ రెండు నెలలు దాటినా డీఎంసీ, పోలీసు అధికారులు కాలనీలోకి వచ్చి ఇక్కడ ఏమి జరుగుతుందో కూడా తెలుసుకోకపోవడం దారుణమని అన్నారు. స్క్రాప్ గోదాంలకు జీహెచ్‌ఎంసీ అధికారులు పోలీసుల సమక్షంలో సీల్ వేసినప్పటికీ వాటిని తొలగించడం చట్టవ్యతిరేక చర్య అవుతుందన్నారు. కోర్టు ఆర్డర్‌ను ధిక్కరించిన వారిపై పట్టించుకొని అధికారులపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం



సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి వర్గ సభ్యులు ఇటీ నర్సింహ

అంబర్‌పేట: ప్రజా సంక్షేమం, ప్రజల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తోంది సీపీఐ పార్టీ అని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇటీ నర్సింహ అన్నారు. కేంద్రం అవలంభిస్తున్న విధానాలు ఎంతో ప్రమాదకరంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. సోమవారం అంబర్‌పేట అలీ కేఫ్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ 4 మహాసభ సమావేశంలో జరిగింది. ఈ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయదేవితో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో పెరుగుతున్న ధరలు, కార్మిక వ్యతిరేక చట్టాలతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్మిక వ్యతిరేకంగా ఉన్న 4 లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని ఇటీ నర్సింహ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 9న కేంద్ర ప్రభుత్వ కార్మిక విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెకు తాము మద్దతూ ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎప్పటికప్పుడు ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మహాసభ కార్యదర్శి బి.వెంకటేశం, నాయకులు కమతం యాదగిరి, ఎస్.శ్రీకాంత్, ఎండీ ఉమర్‌ఖాన్, శ్రీనివాస్, జి.శ్రీనివాస్, లింగస్వామి, రాము తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

శివసేన రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు డా.గణేష్ గౌటే



కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని శివసేన రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డా. గణేష్ గౌటే డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గంపై తీవ్రమైన దాడి చేస్తోందని ఆరోపించారు. కార్మికుల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్న ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల కోసం కార్మిక చట్టాలను మారుస్తున్నారని విమర్శించారు. కార్మికులకు హక్కులు లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 8గంటల పని విధానం రద్దు చేసి 12గంటలు పని చేయాలని కార్మికులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగంలోని రైల్వే, పోస్టల్, బ్యాంకింగ్, రంగాల్లో 30 లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని అన్నారు. అయినా వాటిని భర్తీ చేయకుండా తక్కువ వేతనాలతో కాంట్రాక్టు పద్ధతిలో పనులు చేపడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీల హక్కులను కాల రాస్తున్నారని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతుంటే మన దగ్గర పెట్రోల్, డీజిల్, గ్యాస్ రేట్లు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

మాదిగ దండోర ఉద్యమంతో అందరికీ సమన్యాయం



బంధు సొసైటీ సమావేశంలో మాట్లాడుతున్న భరత భూషణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కుల ఉద్యమంగా ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ ఎన్నో విజయాలను సాధించిందని ఐఆర్‌టీఎస్ రిటైర్డ్ అధికారి అప్పికట్ల భరత్‌భూషణ్ అన్నారు. దండోర ఉద్యమం వికలాంగులు, వితంతువుల పెన్షన్, గుండె జబ్బుల పిల్లల ఆపరేషన్ కోసం, షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ల ప్రమోషన్ కోసం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పునరుద్ధరణకు ఎంతగానో కృషి చేసిందన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బంధు సొసైటీ ఆధ్వర్యంలో దళితుల సమస్యపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భరత్ భూషణ్ మాట్లాడుతూ... పిడికెడు మందితో ప్రారంభమైన మాదిగ దండోర ఉద్యమం అంచలంచెలుగా ఎదిగి ఎస్సీ రిజర్వేషన్లు, 59 కులాల వారీ జనాభా నిష్పత్తి ప్రకారం పంపిణీ చేయాలన్నారు. 30 సంవత్సరాలు సుదీర్ఘ పోరాటం చేసిందన్నారు. సుప్రీం కోర్టు ద్వారా అందరికి సమాన న్యాయాన్ని అందించిన ఏకైక హక్కుల ఉద్యమం మాదిగ దండోరా అని పేర్కొన్నారు. ఈ నాయకత్వాన్ని పూర్తి స్థాయిలో తీసుకెళ్లిన ఘనత పద్మశ్రీ మందకృష్ణ మాదిగకే దక్కుతుందన్నారు. బంధు సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పి. ముత్తయ్య, ప్రొఫెసర్ నతనియాల్, మంద కనకయ్య, వశపాక నరిసింహ, బెజ్జంకి రాంబాబు, అరెపల్లి రాజేందర్, గండి కృష్ణ, ఎస్. నరిసింగరావు, హంసరాజు, పి. ఆంజనేయులు, బలరాం, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చిక్కా రామదాసు అంత్యక్రియలు పూర్తి

చిక్కడపల్లి: తెలుగు సాహిత్య కళాపీఠం వ్యవస్థాపకుడు చిక్కా రామదాసు అంత్యక్రియలు సోమవారం బాపూజీనగర్‌లోని శ్మశానవాటికలో కుమారుడు చిక్కా కిరణ్‌ను నిర్వహించారు. మాజీ రాజ్యసభ సభ్యుడు రాపోలు ఆనందభాస్కర్, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, కవి అందెశ్రీ, చేనేత వర్గాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు, కవులు, బీజేపీ నేత నవీన్‌గౌడ్, కళాకారులు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు.

త్వరలోనే అభివృద్ధి పనులు చేపడుతాం

చిక్కడపల్లి: 'కమ్యూనిటీహాల్.. సౌకర్యాలు నిల్'అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. కార్పొరేటర్ పావని ఆదేశాల మేరకు సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, ఎస్సార్టీ జవహర్‌నగర్ వ్యాయామశాల, ఆట స్థలం, కల్యాణ మండపం పరిక్షణ కమిటీ అధ్యక్షుడు నర్మెట మల్లేష్ సోమవారం కమ్యూనిటీహాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో జీహెచ్‌ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్‌ల సహకారంతో కార్పొరేటర్ పావని రూ.26 లక్షల నిధులు మంజూరు చేయించారని తెలిపారు. త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. పనులు కూడా ప్రారంభించేందుకు కార్పొరేటర్ కృషి చేస్తున్నారని తెలిపారు. కమ్యూనిటీహాల్ అభివృద్ధితో పాటు రెండో అంతస్తు కోసం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఎంపీ లాడ్స్ నుంచి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. కమ్యూనిటీ హాల్‌లో చుట్టు చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని కార్పొరేటర్ ఆదేశించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ సభ్యులు కృష్ణ, గుండు మహేందర్, సలీమ్, శ్రీకాంత్, రాజు, మధన్, రాములు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ వద్ద బీజేపీ నేత వినయ్‌కుమార్, పరిరక్షణ కమిటీ సభ్యులు

పని గంటల పెంపు మేడే పోరాట స్ఫూర్తిని పాతిపెట్టడమే..

మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ముషీరాబాద్: కేంద్ర ప్రభుత్వం 29 లేబర్ చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించి కార్మిక హక్కుల మీద దాడికి రంగం సిద్ధం చేసిందని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. కార్మిక అదనపు శ్రమ దోపిడిని చట్టబద్ధం చేసే కార్మిక జీవోలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్పొరేట్ వర్గాల, పెట్టుబడిదారుల లాభాల కోసం వేతన జీవుల శ్రమను అదనంగా దోచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సంకల్పించిందని విమర్శించారు. బీజేపీ బాటలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రలో చంద్రబాబు ప్రభుత్వం, గుజరాత్‌లో బీజేపీ ప్రభుత్వం పని గంటలను 10గంటలుగా మారుస్తూ జీవోలు తీసుకురావడం కార్మిక వ్యతిరేక చర్య అని విమర్శించారు. కార్పొరేట్, పెట్టుబడిదారుల వర్గాల దాహం తీర్చేందుకు వారితో కుమ్మక్కై చేసిన ఈ చర్యను ఆయన తీవ్రంగా ఖండించారు. పాత ఎనిమిది గంటల పని దినాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు

ముషీరాబాద్: సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు అంబర్‌పేట క్లస్టర్, ఎస్‌పీహెచ్‌వో డాక్టర్ పద్మజ తెలిపారు. సోమవారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో అంబర్‌పేట క్లస్టర్ పరిధిలోని ఆరు యూపీహెచ్‌సీలు, 12 బస్తీ దవాఖానాల వైద్యులు, పీహెచ్‌ఎన్‌లు, వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె పాల్గొని మాట్లాడుతూ... వర్షాకాలం దృశ్య విషజ్వరాలు, డయేరియా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్‌సీడీ, ఫీవర్, డెంగీ వ్యాధులను గుర్తించేందుకు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. యూపీహెచ్‌సీ కేంద్రాల ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా పని చేయాలన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

చిక్కడపల్లి: ఎస్సీ వర్గీకరణకు నిరంతరం పోరాడి సాధించిన మహనీయుడు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అని ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జెల రాజశేఖర్‌మాదిగ అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని డివిజన్ అధ్యక్షుడు ఇల్లెందుల ఎల్లయ్య ఆధ్వర్యంలో డివిజన్‌లోని న్యూబ్రిడ్జి వద్ద నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజశేఖర్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నేతలు నక్క రామారావు, రాజు, ఎల్లయ్య, దశరథ్, వినాయకరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

10న సచివాలయ ముట్టడి

ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్

కవాడిగూడ: తెలంగాణలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలనే డిమాండ్‌తో జూలై 10న సచివాలయం ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్ వెల్లడించారు. లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన చలో సచివాలయం ముట్టడి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా. దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కొరత, విద్యార్థులపై ఒత్తిడి, ఉపాధ్యాయుల కొరత, నాసిరకం మధ్యాహ్న భోజనం, సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడం వంటి అనేక సమస్యలు ఉన్నాయని అన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా బుక్స్, యూనిఫాంలు విక్రయిస్తూ తల్లిదండ్రులను అప్పులపాలు చేస్తున్నారని తెలిపారు. విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ముట్టడి చేపడుతున్నామని ఆప్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర నాయకులు బుర్రా రాములుగౌడ్, మహమ్మద్ మాజిద్, నర్సింగ్, యమునాగౌడ్, విజయ్ పాల్గొన్నారు.

జీఓ నం. 282ను రద్దు చేయాలి

- కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల డిమాండ్
- ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో జీఓ ప్రతుల దహనం



ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో జీఓ ప్రతులను దహనం చేస్తున్న కార్మిక సంఘాల నేతలు

చిక్కడపల్లి: తెలంగాణ షాప్స్, ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్–1988లోని సెక్షన్ 16,17లను సవరిస్తూ తెచ్చిన జీఓ నం. 282ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకుల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో నిరసన తెలిపి జీఓ ప్రతులను దహనం చేశారు. రాష్ట్రంలో లేబర్ కోడ్‌ల అమలుకు మార్గం సుగమం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ జీఓను తెచ్చిందని ఆరోపించారు. వెంటనే దీనిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని లేబర్ కమిషనర్ ఆఫీస్‌కు ప్రదర్శనగా వెళ్లి అడిషనల్ లేబర్ కమిషనర్ డా. గంగాధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి రెబ్బారామారావు, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.సూర్యం, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి అనూరాధ, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎంకె బోస్, ఏఐటీయూసీ రాష్ట్ర ఇన్‌చార్జి భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఇనాక్ సాహిత్యాన్ని ఇతర భాషల్లో అనువదించాలి

తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు

చిక్కడపల్లి: కొలకలూరి ఇనాక్ సాహిత్యం పలు భాషల్లో అనువాదం కావాల్సిన అవసరముందని తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహంలో భాగంగా ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి రచించిన 'ఆచార్య కొలకలూరి ఇనాక్ నాటకం.. తిరుప్పాణ్ ఆళ్వార్ జీవిత చరిత్ర' గ్రంథావిష్కరణ సోమవారం జరిగింది. చిక్కడపల్లి త్యాగరాయ గానసభ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పాటిబండ్ల సత్యనారాయణప్రసాద్ గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. వారం రోజుల పాటు సాహితీ సప్తాహాన్ని నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనామూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు వెంకటేశ్వరరావు, జ్వాలాముఖి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యార్థం శాశ్వత షెడ్లు నిర్మించాలి



దేవాదాయ శాఖ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న శ్రీకనకాల కట్టమైసమ్మ భక్త సమాజం నేతలు

కవాడిగూడ: లోయర్ ట్యాంక్‌బండ్ శ్రీ కట్టమైసమ్మ దేవాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం శాశ్వత షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కట్టమైసమ్మ దేవాలయ భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ టి.రవీందర్ కోరారు. ఈ మేరకు భక్తులతో కలిసి సోమవారం దేవాదాయ శాఖ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. టి.రవీందర్ మాట్లాడుతూ... దేవాలయం వద్ద భక్తులకు శాశ్వత షెడ్లు ఏర్పాటు చేయాలని 20 ఏళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. ప్రతి ఆదివారం, మంగళవారం, శుక్రవారం అమ్మవారికి మొక్కులు సమర్పించుకునే వారు శాశ్వత షెడ్లు లేక రోడ్లపైనే వంటలు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వానికి స్నో వరల్డ్ సమీపంలో ఉన్న ఖాళీస్థలంలో శాశ్వత షెడ్లు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశామన్నారు. తరువాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆ స్థలాన్ని టూరిజం డిపార్ట్‌మెంట్‌కు కేటాయించి ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన వాహనాల పార్కింగ్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కనీసం ఈ ప్రభుత్వమైనా భక్తుల మనోభావాలను గౌరవించి వారి సౌకర్యార్థం శాశ్వత షెడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భక్తులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతానని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్‌రాం, సలంద్రి శ్రీనివాస్ యాదవ్, జి.వెంకటేష్, పరిమల్‌కుమార్, సలంద్రి దిలీప్‌యాదవ్, బొల్ల రమేష్, ప్రభాకర్ గంగపుత్ర తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నేతల అరెస్టు

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల రూ.7,200 బకాయిలను విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసం ముట్టడికి ప్రయత్నించారు. ఒక్కసారిగా విద్యార్థి నాయకులు ఇంటి వైపు దూసుకుపోవడంతో పోలీసులు అడ్డుకున్నారు. బలవంతంగా వ్యాన్‌లోకి ఎక్కించి సమీప పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా కొద్ది సేపు అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు, నాయకులకు మధ్య తోపులాట ఉద్రిక్తత చోటు చేసుకుంది. అరెస్ట్ అయిన వారిలో పీడీఎస్‌యూ జాతీయ నాయకులు మహేష్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్వీ శ్రీకాంత్, పి.నాగరాజు, బోనగిరి మధు, జె.రాజేశ్వర్, పి.కిరణ్, మంద నవీన్, సంతోష్, గొకనపల్లి మస్తాన్, తిరుపతి, అజయ్ తదితరులున్నారు.

ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

జేఏసీ సర్వసభ్య సమావేశంలో ఉద్యమకారుడు డా. చెరుకు సుధాకర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు డా. చెరుకు సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చెరుకు సుధాకర్ మాట్లాడుతూ... ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. రాష్ట్ర సాధన కోసం ఎస్సీ, ఎస్టీ,బీసీ మైనార్టీలే ఉద్యమంలో ఎక్కువ భాగస్వాములయ్యారని తెలిపారు. బహుజన నాయకత్వాన్ని బలోపేతం చేయాలని కోరారు.

పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం

ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ... ఉద్యమ కారుల హక్కుల సాధన కోసం బీఆర్ఎస్ మాట్లాడాలన్నారు. ఉద్యమకారులు త్యాగాలు చేస్తే నేడు పదవులు అనుభవిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఉద్యమకారులను పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

జేఏసీకి నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతరం జేఏసీకి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జేఏసీ చైర్మన్‌గా సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా భక్తుల సోమయ్య, సంగిశెట్టి కిష్టోఫర్, ఉపాధ్యక్షులు భోగే పద్మ, కార్యదర్శిగా ఎస్‌డీ రషీద్, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్, మహిళా విభాగం అధ్యక్షురాలు కోతి మాధవిరెడ్డి, కార్యదర్శిగా అంజలిదేవి, డోలకి యాదగిరి, అంబాల రామరావు, భిక్షం, అరుణ, గట్టు సుధాకర్, జి.పరశురాం తదితరులు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు భక్తుల సోమయ్య, కిస్టోఫర్ భోగే పద్మ , కోతి మాధవి తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమకారుల జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న డా.చెరుకు సుధాకర్